తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## సింహవాహనంపై యోగనారాయణస్వామి

పుంగనూరు, మార్చి 20 ప్రభాతవార్త :
శ్రీకళ్యాణవేంకటరమణస్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం స్వామివారు సింహ వాహనంపై యోగనారాయణుడుగా దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఉదయం నుంచి మూలవిరాట్‌లకు అభిషేకాది పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవమూర్తిని యోగనారాయణ స్వామిగా తీర్చిదిద్దారు. యోగనారాయణ స్వామివారికి శాంతికార్యక్రమాలు అలంకరణలు నిర్వహించిన అనంతరం పట్టణ మాఢవీధులలో ఊరేగించారు. తితిదే పర్యవేక్షణాధికారి మునేంద్రబాబుఅధ్వర్యంలో అర్చకులు శ్రీని వాసాచర్లు, శ్రీకాంతాచార్లు, ఫృధ్విరాజ్‌ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. టిటిడి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## వెంకన్న ఆశీస్సులకోసం తిరుమలలో నారా లోకేష్ కుటుంబం

### -నేడు స్వామివారి దర్శనం



తిరుమల, మార్చి 20 ప్రభాతవార్తప్రతినిధి:
టిడిపి యువనేత ,జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ కుటుంబంతో కలసి బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. గురువారం (నేడు) ఆయన కుమారుడు నారా దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. అన్నప్ర సాదం భవనంలో దేవాన్ష్ పేరున భక్తులకు అన్నప్రసాదాలు అందించేందుకు విరాళాలిస్తారు. తిరుపతి విమానాశ్రయంలో టిడిపి నేతలు సుగుణమ్మ, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట చిన్నబాబు పుష్పగుచ్చాలతో స్వాగతం పలికారు.

## భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు లాంచ్‌ప్యాడ్

### మరికొన్ని గంటల్లో అగ్నిబాణ్ ప్రయోగం
### ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఆధ్వర్యంలో ప్రయోగ ఏర్పాట్లు



శ్రీహరికోట సముద్రతీరంలో నిర్మించిన తొలి ప్రైవేటు లాంచ్‌ప్యాడ్

శ్రీహరికోట (తడ), మార్చి 20 ప్రభాతవార్త
అంతరిక్ష పరిశోధనలో భారత్ మరో అడుగు వేస్తోంది. ప్రైవేటు వారికి లాంచ్‌ప్యాడ్లు నిర్మించుకొని వారి రాకెట్లను ప్రయోగించడానికి దారులు తెరిచింది. ఇందులో భాగంగా శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రంలో భారతదేశపు మొట్టమొదటి ప్రైవేటు లాంచ్ ప్యాడ్ మరికొన్ని గంటల్లో అందుబాటులోకి రానుంది. ఇక్కడ అగ్నికుల్ కాస్మోస్ ప్రైవేటు స్టార్టప్ వారు తాము రూపొందించిన అగ్నికుల్ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. షార్ సముద్ర తీరంలో ఇస్రో ఈ ప్రైవేటు వారికి రాకెట్ ప్రయోగ కేంద్రం నిర్మించుకోవడానికి స్థలం ఇచ్చింది. అక్కడ చిన్న రాకెట్ల ప్రయోగానికి అనుకూలంగా అగ్నికుల్ కాస్మోస్ వారు ప్రయోగ వేదికను నిర్మించుకున్నారు. కొన్ని నెలల విరామం తర్వాత ప్రస్తుతం ఈ రాకెట్ ప్రయోగ వేదిక నుంచి అగ్నిబాణ్‌ను అంతరిక్షంలోని తక్కువ ఎత్తులో ఉన్న కక్ష్యకు ప్రవేశపెడుతున్నారు. ఇస్రో వారి మొదటి ప్రైవేటు లాంచ్ ప్యాడ్ కావడంతో ఈ ప్రయోగాన్ని ఛైర్మన్ ఎస్.సోమనాథ్ స్వయంగా పర్యవేక్షించనున్నారు. అగ్నికుల్ వారి అగ్నిబాణ్ మూడు కీలకమైన భాగాలను లక్ష్యంగా చేసుకుంది. ఇది మూడు దశల రాకెట్ మొదటిదశ ఏడు అగ్నేట్ ఇంజన్లతో పనిచేస్తుంది. ఈ మొదటి దశ పనితీరును ధ్రువీకరించడం భవిష్యత్తు మిషన్లలో వాహనానికి సంబంధించిన శక్తిని నిర్ధారించడానికి పరీక్షావేదికగా మారనుంది. సార్టెడ్‌గా పిలువబడే సబ్ ఆర్బిటల్ టెక్నాలజి డెమానుస్ట్రేటర్ మిషన్ ఇస్రో సహాయంతో అభివృద్ధి చేయబడింది. ప్రైవేటు ఏరోస్పేస్ పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ఈ ప్రయోగానికి పూర్తి మద్దతు తెలిపారు. ఇంతకుముందు స్కైరూట్ వారు తమ విక్రమ్-1 రాకెట్‌ను పరీక్షించిన తర్వాత రెండవ ప్రైవేటు కంపెనీగా అగ్నికుల్ కాస్మోస్ అవతరించింది.

### అగ్నికుల్‌తోనే తొలి ప్రైవేటు ప్రయోగం

భారత ప్రైవేటు లాంచ్ ప్యాడ్ నుంచి మొదటి ప్రయోగాన్ని జరుపుకోవడం అగ్నికుల్ ప్రత్యేకత. దేశానికి సంబంధించి మొట్టమొదటి సెమీ క్రయోజనిక్ ఇంజన్ ఆధారిత రాకెట్ ప్రయోగాన్ని ప్రదర్శించడం ఇందులో రెండో ప్రత్యేకత. దేశీయంగా రూపొందించిన మొదటి సింగిల్ పీస్ త్రీడీ ప్రింటెడ్ ఇంజన్‌ను ఉపయోగించడం ఈ ప్రయోగంలోని మూడవ ప్రాధాన్యతగా ఉంది. సముద్ర మట్టం వద్ద 25 కెఎన్ థ్రస్ట్‌ని అందజేసే ఏడు ఆగ్నేట్ ఇంజన్లతో పనిచేసే ఈ రాకెట్‌లోని ఇంజన్లు అన్నీ ఎలక్ట్రిక్ పంప్-ఫెడ్ ఇంజన్లు. ఇవి సరళీకృత ఇంజన్ డిజైన్ మరియు అత్యంత కాన్ఫిగర్ చేయగల ఇంజన్ క్లస్టరింగ్ ఆర్కిటెక్చర్లను అనుమతిస్తాయని అగ్నికుల్ కాస్మోస్ వారు పేర్కొన్నారు. లాంచ్ వెహికల్ చిన్న ఉపగ్రహాలను లోఎర్త్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టడానికి అనువైనదిగా భావిస్తున్నారు. ప్రైవేటు పెట్టుబడుల కోసం భారతదేశం తన అంతరిక్ష రంగాన్ని తెరిచినందున మల్టీమిలియన్ డాలర్ల మార్కెట్‌కు దారులు తెరిచినట్లయింది.

## తెప్పపై శ్రీరామచంద్రమూర్తి సాక్షాత్కారం

### -సాలకట్ల తెప్పోత్సవాలు ఆరంభం





తిరుమల, మార్చి 20ప్రభాతవార్తప్రతినిధి:
ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల తెప్పోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం సీతాలక్ష్మణసమేత శ్రీరామచంద్రమూర్తిగా తెప్పపై పుష్కరిణిలో విహరించారు. భక్తులకు దర్శనమిచ్చారు. తెప్పపై అధిరోహించిన స్వామివారు మూడుప్రదక్షణలు భక్తుల గోవిందనామ స్మరణల మధ్య ముందుకు కదిలింది. ఈ సందర్భంగా అన్నమాచార్య కళాకారులు స్వామివారిపై భక్తిసంగీతాలను ఆలపించారు. ఈ తెప్పోత్సవంలో టిటిడి పెద్దజీయర్‌స్వామి చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఎస్ఈ జగదీశ్వరరెడ్డి, విఎస్ నందకిశోర్, గిరిధర్, బాలిరెడ్డి, ఆలయ అర్చకులు ,టిటిడి ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ విభాగం సిబ్బంది ,భక్తులు పాల్గొన్నారు. పుష్కరిణి చుట్టూ దశావతారాలు విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి.



బైపాస్ దుకాణంలో అగ్ని ప్రమాదం

## బైపాస్‌లో భారీ అగ్ని ప్రమాదం

శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణంలోని స్కిట్ కళాశాల సమీపంలోని ఓ గోదాములో బుధవారం వేకువ జామును చోటు చేసుకున్న ప్రమాదంలో సుమారు కోటి రూపాయల ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. అయితే ఇక్కడి అగ్నిమాసకదళ వాహనం చాలకుండా నాయుడుపేట నుంచి కూడా వాహనాన్ని తెప్పించి మంటలనుఅదుపు చేసినట్లు సమాచారం.బైపాస్ రోడ్డులో వాటర్ బాటిల్స్, ప్లాస్టిక్ వేస్ట్ నిల్వ చేసు గోదాము ఉంది.రాత్రి యజమాని దుకాణం మూత వేసుకొని వెళ్ళారు.బుధవారం వేకువ జామున గోదాము నుంచి మంటలు ఎగబడుతుండటంతో చుట్టుపక్కల వారు యజమానికి సమాచారం అందించారు.ఆయన వచ్చే సరికి అప్పటికే మంటలు దుకాణం అంతటా వ్యాపించి సరకు అంతా నష్టం జరిగినట్లు తెలిపారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనేది ప్రశ్నార్థకంగా మారింది. సమీపంలోనే విద్యుత్‌శాఖకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను ఆపివేసారు.అధికారులు అంచనా వేస్తున్నారు.

### ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన
## కానిస్టేబుల్ సస్పెండ్

తిరుపతి క్రైం, మార్చి 20, ప్రభాతవార్త
ఎన్నికల కోడ్ ఉల్లంఘించి రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి దిశ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ చక్రి రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పి కృష్ణకాంత్ పటేల్ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ విధులను సమర్ధవంతంగా నిర్వర్తించాలని ఎట్టి పరిస్థితులలో కూడా నియమాలని ఉల్లంఘించవద్దని జిల్లా ఎస్పి కృష్ణకాంత్ పటేల్ ఇది వరకే పలుమార్లు ఉద్యోగులకు దిశా నిర్దేశం చేస్తూ హెచ్చరించారు. బుధవారం తిరుపతి దిశా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించుచున్న చక్రి రాజశేఖర్ పిసి 2514 అను కానిస్టేబుల్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి భాకరాపేటలో ఒక రాజకీయ కార్యక్రమంలో పాల్గొన్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పి సమగ్రంగా విచారణ చేపట్టారు. సదరు కానిస్టేబుల్ ఎలక్షన్ కోడ్‌ను ఉల్లంఘించారని నిరూపణ అవడంతో వెంటనే కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## శ్రీకాళహస్తీశ్వరుని ఆదాయం రూ.2.10కోట్లు



శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. హుండీల్లో రూ. 2కోట్లు 10లక్షల 62వేల 681లు వచ్చిందని ఆలయ ఇఓ ఎస్వి నాగేశ్వరరావు తెలిపారు. 37 రోజుల పాటు హుండీలను లెక్కించారు. స్వామి అమ్మవార్ల హుండీలతోపాటు పరివార దేవతల హుండీలలో సమర్పించిన కానుకలను లెక్కించారు.గతంలో కన్నా హుండీ ఆదాయాలు గణనీయంగా పెరిగాయన్నారు. అలాగే బంగారు నగలు 000.128.000 గ్రాములు వెండి నాగపడగల రూపంలో 592.350 గ్రాములు,విదేశీ నగదు 216నోట్లు వచ్చిందన్నారు. హుండీల లెక్కింపుల్లో తనతో పాటు దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్టీ అధినాయకునితో చర్చించిన తరువాతనే నిర్ణయం

### ఎవ్వరితోనూ ఒప్పందాలు కుదుర్చుకోలేదు: ఎస్‌సివి నాయుడు



శ్రీకాళహస్తి, మార్చి 20 ప్రభాతవార్త
తెలుగుదేశం అధినాయకుడు నారాచంద్రబాబు నాయుడు, జాతీయ కార్యదర్శి నారాలోకేష్‌తో చర్చించిన తరువాతనే తాము పార్టీ ప్రచా రాలు, ఇతర అంశాలకు సంబంధించి నిర్ణయం తీసుకుంటామని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. బుధవారం ఆయన తన అనుచరులతో మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్టీ అధినేత చంద్రబాబునాయుడు శ్రీకాళహస్తి పార్టీ టిక్కెట్టును ప్రకటించారని అయితే పార్టీలో పలువురు సీనియర్లు ఆశావహులు ఉండగా ఎవ్వరితోనూ చర్చించక నిర్ణయించారన్నారు. అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని శాసనసభ్యుడుగా తాను ఎన్నో అభివృద్ది కార్యక్రమాలు చేపట్టామన్నారు. అంతేకాక నా సొంత సొమ్ములు వెచ్చించి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలను గెలిపించుకున్నామని, అలాగే తన సొంత సొమ్ములు వెచ్చించి మున్సిపల్ ఛైర్మెన్‌ను గెలిపించుకున్నామన్నారు. సుధీర్ తన ఇంటి వద్దకు వచ్చినపుడు పార్టీ టిక్కెట్లును ఆశించాము. కానీ మా భవిష్యత్తు ఏమిటో అధినాయకుడు తేల్చకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా తాము అధినాయకుని చర్చించిన తరువాతనే నిర్ణయం తీసుకుంటామన్నారు. సుధీర్‌రెడ్డితో తాము ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ శాసనసభ్యుడు సత్రవాడమునిరామయ్య, మాజీ స్కిట్ ఛైర్మెన్ వంజవాకం గురుదశరధన్, హరిబాబు నాయుడు, నారాయణ యాదవ్, మాధవరెడ్డి, ప్రసాద్‌నాయుడు, సత్రవాడ ప్రవీణ్, భాస్కర్‌నాయుడుపూడి బాబునాయుడు, జానకి రామానాయుడు, చీకటి వేణు, మునిరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతి టిక్కెట్‌పై
## 'ఆరణి' వ్యతిరేకత !

### -స్థానికులకే ఎమ్మెల్యే సీటు ఇవ్వాలంటూ ఏకమవుతున్న శ్రేణులు



తిరుపతి, మార్చి 20ప్రభాతవార్త:
తిరుపతి నియోజకవర్గం అసెంబ్లీ టిక్కెట్ ఖరారుపై టిడిపి, జనసేన పార్టీల శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఇప్పటికే తిరుపతి టిక్కెట్ జనసేన పార్టీకే కేటాయిస్తూ టిడిపి అధినేత చంద్రబాబు కూడా సంకేతాలిచ్చేశారు. తిరుపతిలో ఆ పార్టీకి సరైన అభ్యర్థి లేకపోవడంతో చిత్తూరు నుండి వైసిపి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును తెచ్చుకుని ఇక్కడ పోటీకి నిలబెడుతున్నారు. అయితే ఆయన వాలకం కూడా వైసిపికి అనుకూలంగానే, కోవర్టుగా మారాడనే ఆరోపణలు టిడిపి, జనసేనపార్టీ స్థానిక నేతల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపధ్యంలో తిరుపతిలో గెలవడం ఎంతైనా టిడిపికి అవసరం. అలాంటిది టిక్కెట్ కేటాయింపు, అభ్యర్థిత్వం తిరుపతికి చెందిన స్థానికులకే ఇవ్వాలనేది తెరపైకి వచ్చిన డిమాండ్. ఈ కోవలో బుధవారం సాయంత్రం మరోసారి టిడిపి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ నగరపార్టీ నేతలతో, వార్డు అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశమయ్యారు. స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలని డిమాండ్ బలంచేస్తున్నారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా అయినా పోటీచేయాలని పార్టీ శ్రేణులు ఖరాఖండిగా పట్టుబడుతున్నాయి. ఇదే విషయం గట్టిగా చెబుతున్నాయి. ఈ నేపధ్యంలో తిరుపతి అసెంబ్లీ టిక్కెట్ పరిణామాలు ఎంతవరకు, ఎక్కడకు దారితీస్తాయనేది మరో నాలుగురోజుల్లో తేలిపోనుంది.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



రేణిగుంట, మార్చి 20 ప్రభాతవార్త:
రేణిగుంట విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరచిన సీడబ్ల్యూసీ గోదామును జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి లక్ష్మిశ బుధవారం పరిశీలించారు. చంద్రగిరి నియోజకవర్గానికి 5, తిరుపతి నియోజకవర్గానికి 10, మొత్తం 15 వీవీ ప్యాట్లు ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కొరకు రీప్లేస్‌మెంట్ చేసే విధంగా ఈవీఎం గోడౌన్‌నుంచి సంబంధిత అధికారులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో స్ట్రాంగ్ రూంలకు తీసుకెళ్లి భద్రపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరచిన గోడౌన్‌ను భద్రతా వలయంలో సీసీ కెమెరాల పరివేక్షణలో ఉంచాలన్నారు. ఈవీఎం యంత్రాలకు కల్పించిన భద్రత, ఏర్పాట్ల పట్ల రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తిని వ్యక్తం చేశారు. కలెక్టర్‌తో ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జి, ఎస్‌డీసీ కోదండ రామిరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ప్రచారాలు, సమావేశాలు నిర్వహించవద్దు

### - రాజకీయ పార్టీల ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు




చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త:
ఎలక్షన్ కోడ్ అమలులో వుండటంతో ముందస్తు అనుమతి లేకుండా చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఎలాంటి ప్రచారాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని చిత్తూరు నియోజకవర్గ ఆర్ఓ, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో బుధవారం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రైవేటు ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలతో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ ఈ నెల 16 నుండి ఎన్నికల కోడ్ అమలులో వుందని, వాహనాలు, లౌడ్ స్పీకర్లు, ర్యాలీలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారంకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గాల ఆర్ఓల నుండి 24 గంటలకు ముందు పర్మిషన్ పొందాలన్నారు. నేరుగా ఆర్ఓకు దరఖాస్తులు అందజేయడం లేదా సువిధ యాప్ ద్వారా పర్మిషన్ పొందిన అనంతరం మాత్రమే ప్రచార కార్యక్రమాలు చేపట్టాల్సివుంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా అనుమతులు లేకుండా ప్రచారం ప్రారంభిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని స్పష్టం చేశారు. అలాగే రాజకీయ పార్టీల ప్రచార సామాగ్రికి సంబంధించి ముందుగానే జిల్లా కలెక్టరేట్‌లోని స్పందన హాలులో వున్న ఎంసిఎంసి కమిటీ నుండి పర్మిషన్ తీసుకొన్న అనంతరం ప్రింటింగ్ ప్రెస్‌ల నుండి పంప్లెంట్స్, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు తయారు చేయించుకోవాలన్నారు. ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు ఏ రాజకీయ పార్టీలైనా సరే మీ వద్దకు వచ్చినపుడు ఎంసిఎంసి కమిటీ నుండి పర్మిషన్ లేఖలు తీసుకొన్న అనంతరం మాత్రమే ప్రింటింగ్ ఇవ్వాలన్నారు. అలాగే ఎన్ని కాపీలు, ఎన్ని పోస్టర్లు, ఎన్ని ఫ్లెక్సీలు, వాటి సైజు వంటి పూర్తి వివరాలు, ప్రింటింగ్ ప్రెస్ పేరు తప్పనిసరిగా వుండాలన్నారు. అలాగే ఇప్పటి నుండి ఏప్రిల్ 17వ తేదీ వరకు జరిగే ఖర్చులను పార్టీల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుం దన్నారు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలకు సంబంధించి ఐదు మందికి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్, ఏఆర్ఓ డాక్టర్ జె.అరుణ, సమాచార శాఖ ఇన్‌ఛార్జ్, డిపిఆర్ఓ బి.పద్మజ, ఏఇఆర్ఓలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రింటింగ్ ప్రెస్‌యాజమానులు పాల్గొన్నారు.

## నందివాహనం కిందపడి విద్యార్థి మృతి



మృతి చెందిన విద్యార్థి గోపికృష్ణ(ఫైల్‌ఫోటో)

నగరి, మార్చి 20 ప్రభాతవార్త:
మున్సిపల్ పరిధి సత్రవాడ చిదంబరేశ్వర ఆలయంలో పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అధికార నందివాహన సేవలో అదుపు తప్పి వాహనం పడడంతో సేవలో పాల్గొన్న గోపికృష్ణ(18) అనే విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు... చిదంబరేశ్వర ఆలయంలో నిర్వహించే పంగుణోత్తర కల్యాణోత్సవంలో 5వ రోజు అధికార నందివాహన సేవలో వాహనం అదుపు తప్పడంతో దాని కింద పడ్డ గోపికృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అందించి తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం అతను మృతి చెందాడు. కాగా గోపికృష్ణ ఇటీవలే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. ఇతని మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఆలయంలో ఉత్సవాలను కూడా ఆపి వేశారు.

## కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం



ఎస్ఆర్‌పురం, మార్చి 20 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి, జిడినెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ నరసింహులు అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌తో కలిసి మండలంలోని ఆరిమాకులపల్లి కాలనీలో రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి డాక్టర్ నరసింహులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమాకులపల్లికి చెందిన నాగేష్ పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల సంక్షేమం కోసం పని చేసిన పార్టీ అన్నారు. డిసిసి అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద, దళిత వర్గాల అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీమణి, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, కార్వేటినగరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దినకరప్రసాద్, జిడినెల్లూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు, జిల్లా సేవాదళ్ కార్యదర్శి గౌతమ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మరింత మెరుగ్గా పారిశుధ్యం

**– మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ**



చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త: నగర పరిధిలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ప్రజారోగ్య విభాగ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం ఇందిరానగర్, తంగవేలుకాలనీ, కైలాసపురం రోడ్డు, ప్రకాశం వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ప్రధాన రోడ్లు, వీధులను వీలైనంత త్వరగా శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆమె ఆదేశించారు. అలాగే స్మశాన రహదారిలో పడే వ్యర్థాలను ఏ రోజుకు ఆ రోజు శుభ్రం చేయాలని ఆదేశించారు. మురికికాలువల్లో పూడిక తీత పనులు పూర్తి చేయించాలని, అంతర్గత రహదారులను శుభ్రంగా వుంచాలన్నారు. కమీషనర్‌తో పాటు ఇన్‌ఛార్జ్ ఎంహెచ్ఓ చిన్నయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్ లోకనాథం, వార్డు కార్యదర్శులు వున్నారు.

## జిల్లా కురబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజగోపాల్

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

చిత్తూరు జిల్లా కురబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుప్పం మండలం వానగుట్టపల్లికి చెందిన ఎం. రాజగోపాల్‌ను నియమిస్తూ ఎపి కురబ/కురమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో కురబ సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఈసందర్భంగా పేర్కొన్నారు.

## రాష్ట్ర ప్రగతి దిశానిర్దేశకుడు చంద్రబాబు

**– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం**



కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

రాష్ట్ర అభివృద్ధి,ప్రజా సంక్షేమాల దిశానిర్దేశకుడు మాజీ సిఎం చంద్రబాబునాయుడేనని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి 13వ వార్డులో గతం గుర్తు చేసుకుందాం, చంద్రబాబు రుణం తీర్చుకుందాం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కుప్పంలో నేడు గ్రామగ్రామాన రోడ్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మౌలిక వసతులు కల్పించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గతంలో సిఎంగా చంద్రబాబు కుప్పాన్ని ప్రయోగశాలగా మార్చి ఇక్కడనుంచే పలు పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలు చంద్రబాబును మరింత ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు గోపీనాథ్,కాణిపాకం వెంకటేష్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్, నేతలు వేలు, అప్పు, ఉదయ్, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీతిరుపతిగంగమ్మ ఆలయ నిర్మాణంపై వక్రభాష్యాలు తగవు

**– ఆలయ చైర్మన్ కె.ఎ. మంజునాథ్‌కుమార్**

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గ ంగమ్మ ఆలయ నిర్మాణంపై కొంతమంది రాజకీయ నేతలు వక్రభాష్యాలు చెప్పడం తగదని ఆలయ చైర్మన్ కెఎ మంజునాథ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కంటే అమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మిస్తామని, తాము ఎక్కడా భక్తుల మనోభావాలు దెబ్బతీయలేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆలయాన్ని కొత్తగా రాతితో పునర్నిర్మించాలని తనవంతు సహకారం అందించారన్నారు. గతంలో ఉన్న పాత ఆలయంలో వర్షపు నీరు వస్తే ఆలయంలో ప్రవేశించేదన్నారు. అలాగే పైకప్పులు కూడా పలిగి నీరు ముత్తుమారెమ్మ ఆలయంలో వచ్చేదన్నారు. గతంలో కంటే అమ్మవారి దర్శనం భక్తులకు సులువుగా లభించేలా ఎత్తు పెంచి నిర్మిస్తున్నట్లు తెలిపారు. అతి త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

## వైకాపా విజయానికి కలసికట్టు కృషి

**– చిత్తూరు వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి**



చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త: రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పాటు కావడానికి ప్రతి ఒక్కరు కలసికట్టుగా కృషి చేయాలని చిత్తూరు వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లి ఎస్టేట్ ఆవరణలో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎంసి విజయానందరెడ్డి హాజరై నాయ కులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ తాను సైతం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని గత నాలుగేళ్లుగా చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నా నన్నారు. చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, ఇతర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

**వైకాపాలో చేరిన మాజీ ప్రింటింగ్ ప్రెస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి**

చిత్తూరు వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డిల సమక్షంలో మాజీ ప్రింటింగ్ ప్రెస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి వైకాపా తీర్థం పుచ్చుకొన్నారు. వైకాపా అభ్యర్థి ఎంసి విజయానందరెడ్డి, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డిలు మాజీ ప్రింటింగ్ ప్రెస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డికి వైకాపా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ప్రింటింగ్ ప్రెస్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ వైకాపా విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటు

**– డిప్యూటీ సిఎం నారాయణస్వామి**



ఎస్ఆర్‌పురం, మార్చి 20 ప్రభాతవార్త: సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓటు వేయాలని డిప్యూటీ సిఎం నారాయణ స్వామి పిలుపునిచ్చారు. మండలంలోని ముద్దిగుప్పం, నెలవాయి, క్షీరసముద్రం, ఎస్ఆర్ పురం పంచాయతీల్లో బుధవారం డిప్యూటీ సిఎం నారాయణస్వామి ఎన్నికల ప్రచారంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైకాపా అభ్యర్థి, డిప్యూటీ సిఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మీ ఇంటింటికి వెళ్ళి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసీ రమణప్రసాద్, ఎంపిపి సరిత, ఎస్ఆర్‌పురం సర్పంచ్ హరిత కుప్పయ్య, సర్పంచ్‌లు కుమార్, శేఖర్, మాజీ జడ్పీటిసీ గురువారెడ్డి, వైకాపా నాయకులు, స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా 'దేశం' అధ్యక్షుడు సిఆర్ రాజన్‌కు సన్మానం

ఎస్ఆర్‌పురం, మార్చి 20 ప్రభాతవార్త:

జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడిగా నియమితుడైన సిఆర్ రాజన్, చిత్తూరు పార్లమెంటు తెలుగుదేశం అభ్యర్థి దుర్గం ప్రసాద్‌రావును బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ యాదవ సాధికారిత అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ సన్మానించారు. శ్రీధర్‌యాదవ్ తిరుచానూరులోని సిఆర్ రాజన్ నివాసంలో సిఆర్ రాజన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ బిసీ కోసం పోరాడుతున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. బిసీలందరు తెలుగుదేశం పార్టీని ఆదరించి నారా చంద్రబాబునాయుడును సిఎంగా చేయడమేలక్ష్యంగావిధులు నిర్వహిస్తారన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్ మాట్లాడుతూ జిల్లాలో తెలుగుదేశంపార్టీతరపుననిలిచినఅభ్యర్థులందరిగెలుపుకోసం తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## అరాచక రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

**సత్యవేడు టిడిపి అభ్యర్థి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**

వరదయ్యపాలెం, మార్చి 20, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రగతి కోసం భావితరాల భవిత కోసం టిడిపి విజయం చారిత్రక అవసరమని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ టిడిపిని గెలిపించి సమర్థత అనుభవం గల చంద్రబాబు నాయుడును మళ్లీ సిఎం చేద్దామని, అవినీతి అరాచక రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందామని సత్యవేడు టిడిపి అభ్యర్థి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. సత్యవేడు వైకాపా అభ్యర్థిగా స్థానికులు దొరక్క పక్క ప్రాంతం నుంచి స్థానికేతరుడిని దిగుమతి చేస్తున్న దౌర్భాగ్యం వాళ్ళదన్నారు. అనంతరం ఎమ్మెల్యే టిడిపి నాయకులు శివయ్య, బీజేపి అధ్యక్షుడు పురుషోత్తం, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జై చంద్రబాబు నాయుడు, సీనియర్ నాయకులు మనుభూషణం నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు చలపతి నాయుడు, జనసేన నాయకులు తడ శ్రీనివాసులు తదితర నాయకులను కలిసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, స్థానిక నాయకులు పన్నెం నిర్మల్, మాజీ అధ్యక్షుడు నరసరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమణ, నూతలపాటి శ్రీనప్పనాయుడు, హరిప్రసాద్ చౌదరి, రైతు సలహా కమిటీ చైర్మన్ మురళి నాయుడు, గోవిందయ్య, నాగరాజు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్, అజయ్, కుమార్ చౌదరి, పృధ్వీ, వెంకటేష్ (భారత్ గ్యాస్ ఏజెన్సీ) నిరంజన్ రెడ్డి, మోహన్ నాయుడు, వెంకటేష్ చౌదరి, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎన్నికల విధుల పట్ల అవగాహన పెంచుకోవాలి



పుంగనూరు,మార్చి 20 ప్రభాతవార్త : 165అసెంబ్లీ నియోజకవర్గం పుంగనూరుకు త్వరలో జరుగనున్న ఎన్నికలకు సంబంధించి నియమించబడిన అధికారులు ఎన్నికల విధులు,నియమావళిని పూర్తిగా అవగాహన చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి మధుసూదనరెడ్డి సూచించారు.బుధవారం ఉదయం తహసీల్దార్ కార్యాయంలో ఆయన ఎన్నికల అధికారులు,సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా జరిగే రహస్యబాలెట్ పోలింగ్‌కోసం నియోజకవర్గంలోని ప్రతి కేంద్రంలోనూ పోలింగ్‌కేంద్రాలను అధికారులు పరిశీలించాలన్నారు. నోడల్ అధికారులు,రూట్ అధికారుల అప్రమత్తత ఎంతో అవసరమన్నారు. ప్రతి బూత్ వద్ద సదుపాయాలను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ముందస్తుగా చర్చించి తనిఖీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు

## బుటకపల్లి ఉలవ వంకను పూడ్చే ప్రయత్నం : అడ్డుకున్న రైతులు



చౌడేపల్లి, మార్చి 20 ప్రభాతవార్త

చెరువుకు నీరందించే వంకను సైతం ఆక్రమించే ప్రయత్నం చేస్తుండగా గుర్తించిన రైతులు అడ్డుకొన్న సంఘటన బుధవారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. రైతుల కథనం మేరకు...మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లికి సమీపంలోని గుట్టనుంచి వచ్చే వర్షపునీరు ఉలవ వంకలో పడి గుట్టలోని ఆంజనేయస్వామి ఆలయం మీదుగా పెద్దచెరువుకు చేరుతున్నాయి. బుటకపల్లి పెద్దచెరువుకు ఉలవ వంక ప్రధాన నీటి వనరు. అంతే కాకుండా వంకకు సమీపంలోనే ప్రభుత్వం 2స్కీమ్‌బోర్లు వేసి పక్కనే చెక్‌డ్యామ్ నిర్మాణం చేపట్టారు. వర్షాల సమయంలో చెక్‌డ్యామ్‌లో నీటి నిల్వ మూలంగా బోర్లలో భూగర్భజలాలు వృద్ధి చెందుతున్నాయి. అయితే కొందరు స్వార్థ పరులు వంకను పూడ్చేయడంతోపాటు చెక్‌డ్యామ్‌లోకి సైతం మట్టిని వేసి బోర్ల కబ్జాకు యత్నించారు. విషయాన్ని తెలుసుకొన్న దుర్గసముద్రం, బుటకపల్లి రైతులు వారిని అడ్డుకొన్నారు. ఆక్రమితదారులకు గ్రామ రెవిన్యూ అధికారి అండ వున్నట్లు రైతులు ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన ఎఎన్ఎంపై వేటు

చౌడేపల్లి, మార్చి 20 ప్రభాతవార్త

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించిన ఎఎన్ఎంపై జిల్లా ఎన్నికల అధికారి సస్పెన్షన్ వేటు వేశారు. చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయం-2లో ఎఎన్ఎంగా పనిచేస్తున్న బి.లత ఎలక్షన్‌కోడ్‌ను ఉల్లంఘించి రాజకీయ ప్రచారం చేస్తోందన్న కారణం చూపుతూ జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షన్మోహన్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు.

## వైకాపా ఆధ్వర్యంలో ప్రచారం ప్రారంభం



సదుం, మార్చి 20 ప్రభాతవార్త

మండల పరిధిలో ఎన్నికల ప్రచారం మొదలైంది. బుధవారం వైకాపా రాష్ట్రకార్యదర్శి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో సదుం,అమ్మగారిపల్లె పంచాయతీల పరిధిలోని ఎగువ,దిగువ జాండ్రపేటలలో వైకాపా నాయకులు ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపీ మిధున్‌రెడ్డిలకు ఓట్లు వేయాలని కరపత్రాలు పంచిపెట్టారు. సెంటిమెంటుగా తొలుత స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప,వైకాపా మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్‌కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచులు ఉషారాణి,వరలక్ష్మి,మండల కోఆప్షన్ మెంబర్ ఇమ్రాన్, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కరరెడ్డి, ఉపసర్పంచి బాబురెడ్డి,బూరగమంద ఎంపీటీసీ మల్లికార్జున,మాజీ సర్పంచిలు ధనశేఖరరెడ్డి,సయ్యద్‌భాషా, వైకాపా నాయకులు కాలేషా,షబ్బీర్,మోహన్‌రెడ్డి, చిన్నరమణ,తదితరులు పాల్గొన్నారు.

## తలకోన సిద్దేశ్వరస్వామి హుండీ లెక్కింపు

**యర్రావారిపాలెం,మార్చి20ప్రభాతవార్త** ప్రముఖ శైవ క్షేత్రం అయిన తలకోన సిద్దేశ్వరస్వామి వారి ఆలయ హుండీని బుధవారం ఆలయ అధికారులు లెక్కించారు. 20 రోజులకు గాను రూ.7,27,193లు ఆదాయం వచ్చింది. అదేవిధంగ అన్నదానం హుండీ ద్వారా 20రోజులకు గాను రూ.12130లు వచ్చింది. ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, పాపానాయుడుపేట శ్రీధర్మరాజులస్వామి గుడి కార్యనిర్వ హనాధికారి మునిశేఖరరెడ్డి,పాలమకమండలిసభ్యులు,ఆలయకార్యనిర్వహణాధికారిజయకుమార్‌లు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## స్క్వాడ్ తనిఖీలలో బయటపడిన మాస్‌కాపీయింగ్

**– ఇన్విజిలేటర్‌కు మందలింపు**

కోట, మార్చి 20 ప్రభాతవార్త

కోట మండలంలోని పలు 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జోరుగా జరుగుతోందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాగా, బుధవారం కోటలోని ఓ పరీక్షా కేంద్రాన్ని ఏఎంఓ శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా మాస్ కాపీయింగ్ బయటపడింది. స్వయంగా ఏఎంఓ ఓ విద్యార్థి రాస్తున్న చిట్టాను పట్టుకొని ఇన్విజిలేటర్‌ను మందలించారంటే దీన్ని బట్టి చూస్తే ఏ స్థాయిలో మాస్ కాపీయింగ్ జరుగుతుందో అర్థమవుతుంది. పాఠశాలల వద్ద పరస్పర ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న విమర్శలు లేకపోలేదు. అన్ని పరీక్షా కేంద్రాలు కోటలోనే ఉండటంతో ఇరు పాఠశాలల మధ్య ఒప్పందం కుదుర్చుకొని సహకరించుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో బాగా కష్టపడి చదువుకున్న విద్యార్థులు నష్టపోతున్నారని పలువురి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

***వివరణ***

కోటలోని ఎస్సీ గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థి చిట్టా రాస్తుండగా ఎఎంఓ శివశంకర్ పట్టుకున్నారన్న విషయంపై ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లును 'ప్రభాతవార్త' వివరణ కోరగా, స్క్వాడ్ పట్టుకున్న విషయం వాస్తవమే అని ఇన్విజిలేటర్‌ను మందలించారని ఒప్పుకున్నారు.

## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

**– రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ చంద్రముని**



సూళ్లూరుపేట నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల్లో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ చంద్రముని అన్నారు. బుధవారం స్థానిక వివిఎస్‌సి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాలకు సంబంధించిన పిఓలు, ఏపీఓల శిక్షణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాలలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల నిర్వహణ గురించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అలాగే నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల అధికారులు పాల్గొన్నారు.

## మస్తాన్ యాదవ్ డిమాండ్లను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తా

**మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



వెంకటగిరి టౌన్, మార్చి 20, ప్రభాతవార్త

టిడిపి టికెట్ రాలేదని మన స్థానికి లోనై ఉన్న డాక్టర్ మస్తాన్ యాదవ్ డిమాండ్లను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోనే మస్తాన్ యాదవ్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ మస్తాన్ యాదవ్‌ను కోరారు. ఈ నెల 25వ తేది నుండి టిడిపి అభ్యర్థిని లక్ష్మీ సాయి ప్రియ ఎన్నికల ప్రచార ప్రారంభిస్తున్నారని, ఈ కార్యక్రమానికి రావాలని మస్తాన్ యాదవ్ ఆహ్వానించినట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ ఏఎంసి చైర్మన్ పులికట్లు రాజేశ్వరరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు శ్రీరాములు నాయుడు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## గర్భిణీలకు సామూహిక సీమంతాలు



గూడూరు, మార్చి 20, ప్రభాతవార్త

గర్భవతులు ప్రతి నెల డాక్టర్ల వద్ద పరీక్షలు నిర్వహించుకుని జాగ్రత్తలు పాటించాలని గూడూరు ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ విల్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గర్భవతులు డాక్టర్లు సూచించిన జాగ్రత్తలు పాటిస్తూ సుఖ ప్రసవం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విష్ణు వందన, స్నేహలత రెడ్డి, నిర్మల, లక్ష్మి, శశికళ, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు

## మద్యం విక్రయిస్తున్న ఐదుగురు అరెస్టు



బాలాయపల్లి, మార్చి 20 ప్రభాతవార్త

మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఐదు మందిని అరెస్టు చేసినట్లు సోషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బంది తెలిపారు. జయంపు, పిగిలాం, గొల్లగుంట, నిండలి గ్రామాల్లో నివాసాల మధ్య విస్తరిస్తున్న సుబ్రమణ్యం, అంకమ్మ, పుల్లయ్య, వెంకటరమణ, శేఖర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ సిబ్బంది గోపాల్ తెలిపారు. అరెస్టు చేసిన వారిని రెవెన్యూ అధికారులు ఎదుట హాజరుపరిచినట్లు వివరించారు. పది మద్యం బాటిళ్లను స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

## సచివాలయ సిబ్బంది ఎన్నికల నిబంధనలు అమలు చేయాల్సిందే

**– ఎంపిడిఓ నాగరాజ**

చిట్టమూరు, మార్చి 20 ప్రభాతవార్త

2024 భారత ఎన్నికల నియమావళి ప్రకారం సచివాలయాల సిబ్బంది అందరూ అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఓ నాగరాజ తెలియజేశారు. ఎన్నికల నియమ నిబంధనలు అమల్లో భాగంగా ఏ ఒక్కరు నిర్లక్ష్యం వహించినా వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగా సచివాలయంలోని 9 మంది సిబ్బంది వారికి అప్పగించిన పనులలో భాగంగా విఆర్ఓ గ్రామాల్లోని వీధులు, గృహాలలో ఉన్న బ్యానర్లు, కరపత్రాలు తొలగింపు, డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయ కార్యాలయం, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలల వద్ద, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామంలోని వివిధ పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాలు, జీఎంఎస్‌కెలు అంగన్‌వాడీ కేంద్రాలను, వివిఎలు రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయా గోదాములు, జూనియర్ లైన్‌మెన్లు గ్రామాల్లోని స్తంభాలకు ఉన్న బ్యానర్లు, హోర్డింగుల తొలగింపు, విహెచ్‌ఎలు గ్రామాల్లోని పశువైద్యశాలలు, పరిసరాల్లో అప్పగించిన పనులను మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.

## గర్భిణులు తప్పనిసరిగా పోష్టికాహారం తీసుకోవాలి



బాలాయపల్లి, మార్చి 20, ప్రభాతవార్త

గర్భవతులు చిన్నారులు తప్పనిసరిగా పోష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడి సిబ్బంది కోరారు. జయంపు అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భవతులకు, చిన్నారులకు పోష్టికాహారాన్ని ఇస్తున్నట్లు చెప్పారు. పోష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్ సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

## సేవాతత్పరుడు మగ్దూమ్

**ఎమ్మెల్సీ, వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళి**

గూడూరు, మార్చి 20, ప్రభాతవార్త



సేవాతత్పరుడు మగ్దూమ్ మొహిద్దీన్ అని ఎమ్మెల్సీ, వైసిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో మహమ్మద్ ఫక్రుద్దీన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 786 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మేరిగ మురళీధర్ మాట్లాడుతూ 15 ఏళ్లుగా మగ్దూమ్ మొహిద్దీన్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. తండ్రి పేరుతో ట్రస్ట్ స్థాపించి ఆపన్నులను ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. వైసిపి సిఈసి సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మగ్దూమ్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత సామాజిక సేవా కార్యక్రమాలలో ముందుండాలని ఆకాంక్షించారు. వైసిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు ,మల్లు విజయ్ కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ ఆపన్నులను ఉన్నంతలో ఆదుకోవాలనే తపన కలిగిన వ్యక్తి మగ్దూమ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వైసిపికి ఓటు వేసి గూడూరులో మేరిగ మురళీని ఎమ్మెల్యేగా, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని సిఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మైనారిటీలపై ఉందన్నారు. ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, వైసిపి అధికార ప్రతినిధి ఎండి మగ్దూమ్ మొహిద్దీన్ మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో తన తండ్రి పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవలందిస్తున్నట్లు తెలిపరు. అనంతరం అతిథుల చేతుల మీదుగా నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో బాబు రెడ్డి, ట్రస్ట్ ఉపాధ్యక్షులు ఎండి సర్తాజ్, అనంత్ బాష, వైసిపి మైనారిటీ నాయకులు పఠాన్ అజీజ్ ఖాన్, జీ.జలీల్, షేక్ కాలేషా, అల్తాఫ్, షేక్ బాబు, షబ్బీర్, యస్థాని, గోల్డెన్ గౌస్, సంధాని, అబ్దుల్లా, అర్షద్, కరీముల్లా, ఇమ్రాన్, అమృద్దీన్, గయాజ్ పలువురు పట్టణ మైనారిటీ నాయకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ధ్వజారోహణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గూడూరు, మార్చి 20, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని శ్రీ అళఘనాథ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వేగవంగా ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు విశేషాలంకరణ ఏర్పాటు చేసి మంగళ వాయిద్యాలతో గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభం పై ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని అర్చకులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులు, స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా మాగుంట నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

**చెన్నూరు, విందూరు గ్రామాల్లో కవాతు నిర్వహించిన పోలీసులు**

గూడూరు, మార్చి 20, ప్రభాతవార్త



గూడూరు మండల పరిధిలోని చెన్నూరు, విందురూ గ్రామాల్లో రూరల్ సిఐ వేణు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది పారా మిలిటరీ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎవరైనా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఉపేక్షించేదిలేదనితెలిపారు. విశ్రాంత వాతావరణంలో ఓటర్లు ఓటును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## బీసీలను వాడుకొని వదిలేస్తున్న పార్టీ నాయకులు

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు**



వెంకటగిరి టౌన్, మార్చి 20 ప్రభాతవార్త

బీసీలను రాజకీయ పార్టీలు వాడుకొని వదిలేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకర రావు ఆరోపించారు. వెంకటగిరిలోని డాక్టర్ మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రతి ఎన్నికల సమయంలో బీసీ నాయకులకు గుర్తొస్తానని తెలిపారు. బీసీలను అన్ని విధాల ఉపయోగించుకొని గాలికి వదిలేస్తారని విమర్శించారు. మస్తాన్ యాదవ్ అని కూడా తెలుగుదేశం పార్టీ వారు బాగా ఉపయోగించు కొని డబ్బులు ఖర్చు పెట్టించి టికెట్ ఇవ్వకుండా మోసం చేశారని తెలిపారు.బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ డా॥ కంచర్ల సమక్షంలో తెదేపాలో చేరిక

కుప్పం, మార్చి 20 ప్రభాతవార్త

రామకుప్పం మండలం పెద్దగెరిగపల్లి, చిన్నగెరిగపల్లికి చెందిన వైకాపా నేతలు సుబ్రమణ్యంరెడ్డి, ప్రవీణ్‌లు బుధవారం ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో తెదేపాలో చేరారు. ఈసందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదర ంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, నేతలు రామిరెడ్డి, ఆనందరెడ్డి, విశ్వనాథనాయుడు, నరసింహులు,మునస్వామి,గంట్లప్పగౌడు, మనోహర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు తరపున ఆర్థికసాయం

**కుప్పంరూరల్, మార్చి 20 ప్రభాతవార్త** మండలంలోని నాయనూరుకు చెందిన వెంకటమ్మ మృతి చెందింది. ఈమె మృతి పట్ల తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు తరపున వారి కుటుంబానికి పదివేల రూపాయల సాయాన్ని అందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

## గతం గుర్తు చేసుకుని చంద్రబాబును గెలిపించాలి

**శాంతిపురం, మార్చి 20 ప్రభాతవార్త** కుప్పం ప్రజలు గతంలో చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధి గుర్తు చేసుకుని చంద్రబాబును లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. బుధవారం కర్లగట్ట పంచాయతీలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గతంలో కుప్పం పనిష్మెంట్ ఏరియాగా ఉండేదన్నారు. చంద్రబాబు సిఎం అయ్యాక కుప్పం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో నేతలు నాగభూషణంరెడ్డి, విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, మణి, రామకృష్ణ, కేశవులు, గోపాల్,విజయ్‌కుమార్, దుబాయ్‌గౌడు, హరినాథరెడ్డి, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, పొలారాణి, రూప,హేమ, శ్యామలమ్మ,ఉయ్యాల జయరాంరెడ్డి, నాగరాజు, బసవరాజు, రు ద్రప్ప పాల్గొన్నారు.

## అమర రాజాకు అంతర్జాతీయ అవార్డు



రేణిగుంట, మార్చి 20 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమరరాజా లిమిటెడ్ కంపెనీకి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు లభించినట్లు కంపెనీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. జపాన్ దేశం టోక్యోలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో అమర రాజా సంస్థకు చెందిన అమర రాజా ఎనర్జీ మొబిలిటి యూనిట్లు జేఐఎంపీ నుంచి టీపీఎం అవార్డులు కైవసం చేసుకున్నాయన్నారు. 16 దేశాలకు చెందిన వివిధ కంపెనీలు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థల చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణం కలిగిన ఉత్పత్తులు తయారు చేయడమే అమర రాజా సంస్థల ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉద్యోగులు, కార్మికుల భద్రత పట్ల రాజీ పడమన్నారు. సాధారణ కార్మికుడి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు నిబద్ధతతో విధులు నిర్వహిస్తారన్నారు. అందు వల్లే అమర రాజా సంస్థలు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయ న్నారు. టోక్యో వెళ్లి అవార్డులు తీసుకొచ్చిన చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ నరసింహా నాయుడు, ఇండస్ట్రీయల్ డివిజన్ ఆపరేషన్ హెడ్ శ్రీనివాసరావు, ఆటోమోటివ్ డివిజన్ ఆపరేషన్ హెడ్ మునీశ్వర నాయుడు, సీహోఈహెడ్ సుభాష్, టీపీఎం కో-ఆర్డినేటర్ రాజేష్, బిజినెస్ హెచ్ఆర్ మేనేజర్ ఈశ్వరరావు, కంపెనీకి చెందిన అధికారులను, కంపెనీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న కార్మికులు, ఉద్యోగులు, హెచ్వోడీలను చైర్మన్ గల్లా జయదేవ్ అభినందించారు.

## ఎన్నికల నోడల్ అధికారులు విధులపై...

# పూర్తి స్థాయి ప్రణాళికతో విధులు నిర్వర్తించాలి : కలెక్టర్

తిరుపతి కర్పొరేషన్, మార్చి 20 ప్రభాతవార్త : ఎన్నికల జిల్లా స్థాయి నోడల్ అధికారులు వారి విధులపై పూర్తి స్థాయి అవగాహనతో పక్కా ప్రణాళికతో విధులు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితిలో అలసత్వం ఉండరాదని, ఎన్నికలకు చెందిన పలు అంశాల టైం లైన్ చార్ట్‌పై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీ షా అవగాహన కల్పించారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్ నందు ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ నోడల్ అధికారిగా వారికి కేటాయించిన విధులపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఆకళింపు చేసుకొని అప్రమత్తంగా నోడల్ అధికారులు వ్యవహరించాలని సూచించారు. సి విజిల్‌లో అందిన ఫిర్యాదులు ఎన్నికల సంఘం సూచించిన 100 నిమిషాల్లో పరిష్కరించాలని సూచించారు. ఎంసిసి ఉల్లంఘనలు ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని, తప్పనిసరిగా చర్యలు ఉంటాయని, అధికారులు అందరూ ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీ షా

ఉన్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎటువంటి రాజకీయ ప్రచారాన్ని అనుమతించరాదని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుండి లిక్కర్లు, ఓటర్లను ప్రభావితం చేసే పలు రకాల వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టా లన్నారు. వెబ్ కాస్టింగ్ ఏర్పాటుతో సరిహద్దు ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన చెక్ పోస్టులు ఉన్న చోట వెబ్ కాస్టింగ్ ద్వారా ఈసిఐ, సిఈఓ ఏపీ, జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ నిరంతర పరిశీలన ఉంటుందని తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై వాటి టైం లైన్ చార్టి పై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కులశేఖర్, ఎన్నికల విధులు కేటాయించబడిన వివిధ నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌కు ఘన స్వాగతం

రేణిగుంట, మార్చి 20 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం రాత్రి ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయంలో ఆయనకు తిరుపతి టీడీపీ సీనియర్‌నేత నరసింహయాదవ్, ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ సీనియర్ నేతలు పులివర్తి నాని, టీడీపీ సీనియర్ యువజన నేతలు శ్రీధర్‌వర్మ, కృష్ణయాదవ్, మురళి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు.



## బైరెడ్డిపల్లెలో మాజీ మంత్రిని అడ్డుకున్న అధికారులు



పలమనేరు,మార్చి 20 ప్రభాతవార్త: బైరెడ్డిపల్లె మండలంలో పర్యటనకు ముందస్తు అనుమతులు లేకుండా మాజీ మంత్రి అమరనాథరెడ్డిని అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని బేలుపల్లె పంచాయితీ పరిధిలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం నిర్వహించారు. అయితే అధికారులు అనుమతులు లేకుండా పర్యటిస్తున్నారంటూ ఆయనను అడ్డుకున్నారు. దీనిపై మాజీ మంత్రి అమరనాథరెడ్డి చరవాణి ద్వారా ఆర్డీఓ, ఆర్ఓ మనోజ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతూ ముందస్తు అనుమతుల కోసం ధరఖాస్తు చేసుకున్నామని, అయితే అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో ప్రచార వాహనాలు, పార్టీ జెండాలు, స్పీకర్లు లేకుండా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లడం జరిగిందని తెలిపారు. అయితే ప్రస్తుత ఎన్నికల నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలని ఆర్డీఓ, ఆర్ఓ సూచించడంతో మరో మారు అనుమతుల కోసం ఆయన వినతిపత్రం అందిస్తు అనుమతులు వచ్చేవరకు కార్యక్రమాలను వాయిదా వేయడం జరిగింది.

## ఆరేపల్లి రంగంపేట వద్ద భువనేశ్వరికి ఘన స్వాగతం

చంద్రగిరి, మార్చి 20 ప్రభాతవార్త: టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరికి ఆరేపల్లి రంగంపేట వద్ద బుధవారం టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమం కోసం రాయచోటికి వెళుతూ మార్గ మధ్యలో రంగం పేట వద్ద కొంత సమయం ఆగి పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ దొరస్వామి నాయుడు, పలువురు మహిళలు ఆమెకు దుశ్శాలువలు అలంకరించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె రాయచోటికి బయలుదేరి వెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అనూరాధ, లంకెళ్ళ లలిత, నారావారిపల్లి సర్పంచ్ లక్ష్మి, అమ్ములు, సునీత, మల్లిక, రాధ, రాణి, తదితరులు పాల్గొన్నారు. ఏజి పల్లి బాల, గౌస్‌భాషా, దేవీలాల్, బెల్లంకొండ రమేష్ రాయల్, జ్ఞానశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## నారా భువనేశ్వర్‌కి ఘన స్వాగతం



రేణిగుంట, మార్చి 20 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సతీమణి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాతృమూర్తి నారా భువనేశ్వరికి రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం తెలుగు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆమెకు స్వాగతం పలికిన వారిలో శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి తెలుగు యువత పార్లమెంటరీ స్థాయి నేత కృష్ణయాదవ్, రాష్ట్ర తెలుగు యువత నాయకుడు రవినాయుడు, తిరుపతి, రేణిగుంట తెలుగుదేశం పార్టీ నేతలు ఉన్నారు. స్వాగత సత్కారాల అనంతరం రోడ్డు మార్గంలో ఆమె తిరుపతి బయలుదేరి వెళ్లారు.

## ప్రాచ్య పరిశోధన సంస్థ అపూర్వ సాంస్కృతిక కేంద్రం

**ఆచార్య రాకేష్ మోహన్ జోషి**

తిరుపతి క్రీడ, మార్చి 20 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఓఆర్ఐని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్మెంట్, బెంగళూరు, డైరెక్టర్ ఆచార్య రాకేష్ మోహన్ జోషి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపూర్వ తాళపత్ర సంపద తనని ఆశ్చర్య చకితుని చేసిందని, భారతీయ సంస్కృతి ఒక చోట రాశి పోసినట్లుగా గ్రంథాలయం ఉందని అన్నారు. గ్రంథాలయంలోకి వివిధ లిప్తులను పరీక్షించి కన్నడ తాళపత్రాన్ని చదివి సంతోషించాడు. సంస్థ సంచాలకులు ఆచార్య పిసి వెంకటేశ్వర్లు, రీసెర్చి డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య విజయభాస్కర రావు వీరికి సంస్థ ప్రాముఖ్యతను వివరించారు.



## ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన

**- మరో ఎఎన్ఎంపై వేటు వేసిన జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్**

చిత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించడంతో బుధవారం మరొక వికెట్ పతనం అయ్యింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎఎన్ఎం బి.లతపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సగిలి షన్మోహన్ సస్పెన్షన్ వేటు వేశారు. చౌడేపల్లి సచివాలయం-2లో రెగ్యులర్ ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న బి.లత ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించి సాక్ష్యాలతో దొరికిపోయారు. ఈ మేరకు ఆమెపై సస్పెన్షన్ వేటు వేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు.

## రాష్ట్రంలో తెదేపా..జనసేన..బిజెపి కూటమి విజయం తథ్యం

**- తెదేపా రాష్ట్ర వన్నియకులక్షత్రియ కన్వీనర్ జిఎం రాజు**



కుప్పంరూరల్, మార్చి 20 ప్రభాతవార్త : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తెదేపా, జనసేన కూటమి విజయం తథ్యమని తెదేపా రాష్ట్ర వన్నియకులక్షత్రియ సాధికార సమితి కన్వీనర్ జిఎం రాజు, మాజీ ఎంపిపి సాంబశివం, బిసి సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడిగా సిఆర్ రాజన్‌ను నియమించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. చిలకలూరిపేటలో సభలో భద్రత పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఉన్న వన్నియ కులక్షత్రియుల సంక్షేమం తెదేపా అధినేత చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. కుప్పంలో ఈసారి చంద్రబాబు లక్ష ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. సమావేశంలో నేతలు ఎవి రవి, గోవిందప్ప, సురేష్, వెంకటేష్, నాగేంద్రకుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కోదండరామస్వామి ఊంజల్ సేవ



శాంతిపురం, మార్చి 20 ప్రభాతవార్త : మండలంలోని రాళ్లబూదుగూరులో వెలసిన శ్రీ కోదండరామ స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామివారిని సింహ వాహనంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈనెల 25న స్వామివారి రథోత్సవం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

**భక్తితత్వాన్ని చాటిన**

## ఆదిగురుస్వామి అన్నమయ్యకీర్తనలు



తిరుపతి, మార్చి 20ప్రభాతవార్త: తిరుపతి రామచంద్రపుష్కరిణిలో బుధవారం సాయంత్రం జరిగిన ఆదిగురుస్వామి అన్నమయ్యకీర్తనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టిటిడి ఇక్కడ ప్రతిరోజూ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గాయకుడు ఆదిగురుస్వామి అన్నమయ్య కీర్తనలను లయబద్ధంగా ఆలపించారు. గాత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, సభ్యులు సురేష్‌స్వామి, కొండె చెంగారెడ్డి, తోండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కెఎస్ రాజు ఆదిగురుస్వామిని ఘనంగా సత్కరించారు.

## ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందించిన సిఎం

**- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**

కుప్పం(గుడుపల్లె), మార్చి 20 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రజలకు సిఎం జగన్ పారదర్శకంగా పథకాలు అందించారని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. బుధవారం యామనూరు పంచాయతీ సరిగప్ప కొటాలులో రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్‌తో కలసి ఆయన గడగడపకు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాట తప్పని వ్యక్తి సిఎం జగనన్న అన్నారు. ప్రతి పేదవాడి సొంతింటి కల సాకారం చేసేందుకు పెద్ద ఎత్తున జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా ప్రజలు తనకు అవకాశం కల్పించాలని కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమాల్లో జడ్పీటిసి కృష్ణమూర్తి, స్థానిక నేతలు పాల్గొన్నారు.



## 'పది' పరీక్షల్లో నిబంధనలకు తిలోదకాలు!

సత్యవేడు, మార్చి 20 ప్రభాతవార్త : సత్యవేడు మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ స్కూల్ యాజమాన్యం పది పరీక్షల్లో విద్యాశాఖ నిబంధనలకు తూట్లు పొడుస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ పాఠశాల అధికార పార్టీ నేతలకు సంబంధించినది కావడంతో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో నిబంధనలకు తిలోదకాలు పలుకుతున్నారు. సత్యవేడు మండల విద్యాశాఖ పరిధిలో సత్యవేడు హైస్కూల్, మహాత్మపూలే బాలుర గురుకులం, అంబేద్కర్ బాలికల గురుకులం పరీక్షాకేంద్రాల్లో దాదాపుగా 436 మంది విద్యార్థులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు. అందులో 8మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్టు తెలిసింది. కాగా పది పబ్లిక్ పరీక్షల్లో జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయడం జరుగుతుంది. అన్ని పాఠశాలల విద్యార్థులు జంబ్లింగ్ విధానంలోనే పరీక్షలు రాస్తున్నారు. కాగా ఈ స్కూల్ విద్యార్థులకు మాత్రం అందుకు విరుద్ధంగా జంబ్లింగ్ విధానాన్ని పక్కనపెట్టి అందరూ ఒకే పరీక్షాకేంద్రంలో ఒకే గదిలో పరీక్షలు రాస్తున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యంఈఓ రవిని ఈవిషయమై అడుగగా మాకు సంబంధంలేదు, అంతా జిల్లా అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయని మాట దాటవేస్తున్నారని వారు చెపుతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సూపర్‌సిక్స్‌తో ప్రతి ఇంటికి సంక్షేమం

**వడమాలపేట, మార్చి 20 ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ ఎన్నికల హామీలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలతో భవిష్యత్‌లో ప్రతిఇంటికి సంక్షేమం అందుతుందని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ తెలిపారు. బుధవారం వేమాపురంలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పూలవర్షంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చస్తున్నానని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయలునాయుడు, మణిరాజు, వెంకటయ్య, శేషాద్రి, వేణు ఆచారి, శ్రీనివాసులు, చంద్ర, వెంకటపతి, రమేష్, నారాయణ, యుగంధర్, తిరుమలేష్, వినోద్, వంశి, గురవయ్య, సురేష్, భువనేష్, నవీన్, ప్రకాష్, సాయి గణేష్, భాను, శివ, నాయకులు మహేష్, మునిశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్.కె.రోజాను గెలిపించండి



పుత్తూరు, మార్చి 20 ప్రభాతవార్త : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి ఆర్.కె.రోజాను మెజార్టీతో గెలిపించాలని ఆమె సోదరుడు, వైకాపా నాయకుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. పుత్తూరు మునిసిపాలిటీలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికిసంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరు అండగా నిలవాలన్నారు. నగరి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న రోజాను గెలిపించాలన్నారు. గత అయిదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరొక అయిదేళ్ల పాటు కొనసాగేందుకు రోజాను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

## వైకాపా నేత పాపారెడ్డికి పలువురు రాజకీయ నాయకులు ఘన నివాళులు

వాకాడు, మార్చి 20 ప్రభాతవార్త: వాకాడు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం గ్రామంలోని బుధవారం వైకాపా సీనియర్ నాయకుడు పాపా రెడ్డి సుబ్రమణ్యం రెడ్డికి పలువురు రాజకీయ నాయకులు ఘన నివాళులు అర్పించారు. గొల్లపాలెం గ్రామంలో ఉత్తర క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు చైర్మన్, వెంకటగిరి వైకాపా అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, గూడూరు టిడిపి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, గూడూరు వైకాపా అభ్యర్థి మేరీగా మురళి, నేదురుమల్లి గౌతమ్ రెడ్డిలు సుబ్రమణ్యం రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ ఏఎంసి చైర్ పర్సన్ పాపా రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డిని పరామర్శించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలతో పాటు తిరుపతి, చెన్నై, బెంగళూరు పలువురు నాయకులు, పారిశ్రామికవేత్తలు, బంధుమిత్రులు, వైకాపా కార్యకర్తలు, ప్రజలు తదితరులు ఉత్తర క్రియలులో పాల్గొన్నారు.



## బీసీలకు అన్యాయం చేసిన టిడిపి

**రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ యాదవ్**



వెంకటగిరి టౌన్, మార్చి 20 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ టికెట్‌ను కష్టపడిన వారికి ఇవ్వలేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మస్తాన్ యాదవ్ ఆరోపించారు. వెంకటగిరిలోనే టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ కోసం తాను మాజీ ఎమ్మెల్యే కొరుగుండ్ల రామకృష్ణ ఎంతగానో కష్టపడ్డామని, అయితే వేరే వారికి ఇచ్చారని తెలిపారు. కష్టపడ్డ వారికి టికెట్టు ఇవ్వనందున తాను పార్టీ గెలుపుకు కృషి చేయనని తెలిపారు. అందరితో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలి

**రిటర్నింగ్ అధికారి అథితి సింగ్**



తిరుపతి కార్పొరేషన్, మార్చి 20 ప్రభాతవార్త : ఎలక్షన్ కమిషన్ రూపొందించిన ఎన్నికల నియమ నిబంధనలను అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అథితి సింగ్ తెలియజేసారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో జరిగిన సమావేశం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అథితి సింగ్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని, ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైన ప్రవరిస్తే ఎన్నికల కమిషన్ చట్టప్రకారం తగు చర్యలు తీసుకుంటుందని తిరుపతి రిటర్నింగ్ అధికారి, కమిషనర్ అథితి సింగ్ తెలిపారు. ఈ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అదనపు రిటర్నింగ్ అధికారులు తిరుపతి అర్బన్ ఎమ్మార్వో వెంకటరమణా రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిఎస్పి సురేంద్ర రెడ్డి, సిఐ జయ నాయక్, డిటి జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అరబిందోపనిషద్ అనే అంశం పై జాతీయ సదస్సు

తిరుపతి క్రీడ, మార్చి 20 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి, అరబిందో సొసైటీ తిరుపతి బ్రాంచ్ కలిసి శ్రీ అరబిందోపనిషద్ అనే అంశం పై జాతీయ సదస్సు సెమినార్ హాల్ హ్యూమానిటీస్ బ్లాక్ ఎస్‌పిఎంవివి తిరుపతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ప్రొఫెసర్ డి. భారతి మాట్లాడుతూ అరవిందోపనిషత్ గురించి వారు శ్రీ అరవిందుల వారి యోగాంశాలు అతని జీవితంలోని ఆధ్యాత్మిక అంశాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధిగా విచ్చేసి ములుగు శ్రీనివాసుల మాట్లాడుతూ ఈ దేశంలో స్కిల్స్‌కి సమస్య లేదని విలువలకు సమస్య ఉందని వారు వాపోయారు. ఉపనిషత్తులు, భగవద్గీత పారాయణం చేయాలని తెలిపారు. శ్రీ అరవిందుల వారు సనాతనధర్మంలో తెలియజేసినట్లు యువత తమ జీవితాన్ని తామే పునరుద్దరీ కరించుకోవాలన్న అంశాన్ని తెలియజేసారు. ముందు మనిషి నలోకి తాను వెళ్లి అన్వేషణ చేయాలని శ్రీ అరవిందుల వారి జీవితాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.



విద్యార్థులకు జ్ఞాపికను, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

అనంతరం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ జె. కాత్యాయని మాట్లాడుతూ అతిధులను పరిచయం చేశారు. యోగాలు ఎలా అలవర్చుకొని మన జీవితాన్ని ఎలా సార్థకం చేసుకోవాలో వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రొ. టి. నాగరజని మాట్లాడుతూ అరవిందుల వారి పూర్ణయోగసాధన అనే అంశం పై మాట్లాడుతూ ఆసనాలు, ప్రాణాయామాలు మొదలైనవి ప్రాణశక్తిని నియంత్రిస్తాయని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని డీన్ స్టూడెంట్ అఫైర్స్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఇంగ్లీష్, తెలుగు స్టడీస్, ఉమెన్ స్టడీస్ కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ విద్యార్థులు పత్ర సమర్పణ చేసారు. ఆచార్య భారతి చేతులు మీదుగా జ్ఞాపిక ధ్రువీకరణ పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. సుభాషిని స్వాగతం పలుకగా డాక్టర్ రవి వందన సమర్పణం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి. యువశ్రీ, ఆచార్య ఎం. నీరజ, డాక్టర్ పి. నీరజ, డాక్టర్ బి.లక్ష్మీ ప్రియా తదితర అధ్యక్షులు వివిధ శాఖల విద్యార్థులు పాల్గొని సభను విజయవంతంగా ముగించారు.



**శ్రీకాళహస్తి పురపాలక సంఘం, శ్రీకాళహస్తి**

ఆర్.ఓ.సి నెం.397/2020/ఎ1 **బహిరంగ వేలము ప్రకటన**

2024-25 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించిన గుత్తలు వసూలు చేసుకొను హక్కు బహిరంగ వేలము వేయుటకు కౌన్సిలు తీర్మానం సంఖ్య 807, తేది 19.03.2024న ఆమోదించబడినందున, శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయము నందు తేది 26-03-2024న ఉదయం 11.00గంటలకు కమిషనర్ వారిచే గానీ లేదా వారి అనుమతి పొందిన వారిచే గానీ బహిరంగ వేలము నిర్వహించబడును. వేలము నందు పాల్గొనువారుచిత్తూరు జిలాల రాజపత్రము నెం.77/2024 తేది 05-02-2024 నందలి వేలము షరతులకు బద్దులై వేలము నందు పాల్గొనవలెను.

| వ.నెం | గుత్త వివరములు | వేలము ధరావత్తు (రు) | సాల్వెన్సీ ధృవపత్రము విలువ రూ. |
|---|---|---|---|
| 1. | మినీ కూరగాయల మార్కెట్టు (ఇ-సేవా ప్రాంగణము వద్ద) | 1,00,000 | 25,00,000 |
| 2. | మాంసము మరియు చేపల మార్కెట్ (ముత్యాలమ్మగుడి వీధి) | 25,000 | 5,00,000 |
| 3. | జంతువధశాల | 10,000 | 1,00,000 |

వేలము పాటలో పాల్గొనువారు పై తెలిపిన ధరావత్తు మొత్తముతో పాటు పురపాలక సంఘ పరిధిలోని ఇల్లు లేదా ఖాళీ స్థలములకు మునిసిపల్ కమిషనర్ గానీ, తహశీల్దార్, శ్రీకాళహస్తి వారిచేగానీ జారీ ఏయబడు సాల్వెన్సీ ధృవపత్రము మరియు ఎన్‌కంబర్స్‌లతో పాటలో పాల్గొనవలెను. వేలము పాటలో పాల్గొనదలచిన వారు మిగతా వివరములు కొరకు కార్యాలయములో ఎ1 గుమాస్తా/ రెవెన్యూ ఇన్స్పెక్టర్/ రెవెన్యూ అధికారి వారిని సంప్రదించగలరు.

కమిషనర్, శ్రీకాళహస్తి పురపాలక సంఘం